సంపుటి : 9
సంచిక : 327
బుధవారం
19 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వ వాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT


CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మీ ఫోన్‌లో మా డిజిటల్ దినపత్రికను పొందండి.
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999


### స్థానిక సంస్థల ఎన్నికల్లో

# బీసీలకు 34% రిజర్వేషన్లు



- బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం : సీఎంచంద్రబాబు
- పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా బీసీలకు వెన్నుదన్ను.. అసెంబ్లీలో చంద్రబాబు చారిత్రక ప్రకటన
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- అసెంబ్లీ వేదికగా చారిత్రక నిర్ణయం ప్రకటించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 28 జిల్లా పరిషత్‌ల ఏర్పాటు, మేయర్లు, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు
- బీసీ రిజర్వేషన్లు తగ్గించి గత ప్రభుత్వం ద్రోహం చేసిందన్న ముఖ్యమంత్రి
- పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు అండగా ఉంటామని స్పష్టీకరణ

**అమరావతి, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** "పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని సీఎం ప్రకటించగానే సభ "జయహో బీసీ" నినాదాలతో దద్దరిల్లింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించుకుందని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లను బీసీలకు మిగతా .. 2లో..

### మెగా డీఎస్సీ

## అద్భుతంగా నిర్వహించారు


### నారా లోకేశ్‌ను ప్రశంసించిన ఢిల్లీ మంత్రి శిర్సా



**అమరావతి, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా టీచర్ పోస్టులను ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిన తీరు అద్భుతమని ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా ప్రశంసించారు. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పాలనా దక్షతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయంలో మిగతా .. 2లో..

## పోలీసుల క్రూరత్వాన్ని ప్రశంసించాలా?

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల నిరసనల సమయంలో ఏ ఒక్కరికీ హాని జరగలేదని, వాస్తవానికి దిల్లీ పోలీసులను ప్రశంసించాలంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా మిగతా .. 2లో..

### భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి

## బాంబు బెదిరింపు

### ఎయిర్‌పోర్టులో సీఐఎస్ఎఫ్ విస్తృత తనిఖీలు

### బెదిరింపు మెయిల్‌పై నిఘా వర్గాల ఆరా



**భోగాపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం సాయంత్రం బాంబు బెదిరింపు కలకలం రేపింది. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాశ్రయ అధికారులు అప్రమత్తమయ్యారు. విమానంలో మిగతా .. 2లో..

### గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం

## ముమ్మర గాలింపు చర్యలు

### కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి : మంత్రి వాసంశెట్టి సుభాష్



**అమరావతి, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం అధికారులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులతోను, అధికారులు తోనూ అమరావతి నుంచి ఫోన్ ద్వారా మాట్లాడిన మంత్రి, ప్రభుత్వం ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తోందని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం, ఇండియన్ కోస్ట్ గార్డ్, ఇండియన్ నేవీ, మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సముద్రంలో విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఓడలరేవు గ్రామానికి చెందిన కొపనాతి రామకృష్ణవర్మతో పాటు మిగతా .. 2లో..

### కోనసీమ స్టాల్‌ను పరిశీలించిన

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్



**అమలాపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కోనసీమ స్టాల్‌ను పరిశీలించారు. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ మిగతా .. 2లో..

### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా

## వర్ల రామయ్య, దళవాయి రమ

### అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్


### ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం



**అమరావతి, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక మిగతా .. 2లో..

### 27 ఏళ్లుగా అమెరికాలోనే నివాసం..

## వృద్ధురాలిని నిర్బంధించిన ఐసీఈ



**ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలో దాదాపు 27 ఏళ్లుగా చట్టబద్ధంగా నివాసముంటూ, గ్రీన్ కార్డ్ కలిగిన భారత సంతతికి (తెలుగు) చెందిన వెంకట నరసమాంబ వాసంశెట్టి అనే వృద్ధురాలిని యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హఠాత్తుగా నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆమె డిపోర్టేషన్ (దేశ బహిష్కరణ) కేసుకు మిగతా .. 2లో..

### నా మాటలు ఎడిట్ చేసి

## వైకాపా దుష్ప్రచారం


### ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తోందని జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. తన మాటలను ఎడిట్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వైకాపా ఒక ఫేక్ పార్టీ అని, ఆ పార్టీ నాయకులు ఫేక్ నాయకులని దుయ్యబట్టారు. జగన్ అరాచక పాలనకు వ్యతిరేకంగా కూటమిగా ఏర్పాటైనట్లు చెప్పారు. కూటమి పాలన 15 ఏళ్లపాటు ఉండాలనేది తమ లక్ష్యమన్నారు. తమ మధ్య చిచ్చుపెట్టాలన్న వైకాపా ప్రయత్నాలు ఫలించవని చెప్పారు.

## దేవాలయ ఉద్యోగాల్లో రాయలసీమకు అన్యాయం జరగలేదు

### మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**అమరావతి, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో అర్చకులు, వేద పండితుల నియామకాల్లో రాయలసీమ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతోందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల భర్తీ చేసిన మొత్తం 344 పోస్టుల్లో మిగతా .. 2లో..

## స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీలతో కలిసి బరిలోకి దిగుతాం : మాధవ్




**విశాఖపట్నం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భాగస్వాములతో కలిసే బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల కీలక సమావేశంలో మాట్లాడిన ఆయన, స్థానిక ఎన్నికల సమన్వయ బాధ్యతలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే వార్డు స్థాయి నుంచి ప్రతి మిగతా .. 2లో..

### తిరుమలలో బుధవారం ఎస్ఎస్‌డీ

## టోకెన్ల జారీ నిలిపివేత



**తిరుపతి, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీని బుధవారం నిలిపేస్తున్నట్లు తితిదే మంగళవారం తెలిపింది. గురువారం దర్శనానికి సంబంధించి బుధవారం జారీ చేయనున్న టోకెన్లు ఇవ్వరని.. భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని సర్వదర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. శుక్రవారం దర్శనానికి సంబంధించి గురువారం మధ్యాహ్నం మిగతా .. 2లో..




## 22ఏ నిషేధిత భూములు.. కట్టుకథలు నమ్మొద్దు

### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్, మిగతా .. 2లో..

### ఇమ్రాన్ ఖాన్‌ను వెంటనే

## ఆస్పత్రికి తరలించండి : పాక్ సుప్రీం కోర్టు



**ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో.. వెంటనే ఆస్పత్రికి తరలించాలని అక్కడి అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను ఉటంకిస్తూ.. కుటుంబ సభ్యులు, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

భోగాపురం వెళ్లాల్సిన ఇండిగో విమానానికి

## బాంబు బెదిరింపు

బాంబు అమర్చినట్లు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందడంతో భద్రతా సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగారు. ఈ బెదిరింపు నేపథ్యంలో, విమానాశ్రయ భద్రతా బాధ్యతలు పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు వెంటనే తనిఖీలు ప్రారంభించాయి. ప్రయాణికులను సురక్షిత ప్రాంతానికి తరలించి, విమానాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు. విమానాశ్రయ ప్రాంగణంలోనూ భద్రతను కట్టుదిట్టం చేసి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మరోవైపు, ఈ బాంబు బెదిరింపు ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో నిఘా వర్గాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం

## ముమ్మర గాలింపు చర్యలు

మరో ఆరుగురు మత్స్యకారులు ఆగస్టు 3న చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లారని, ఇప్పటికే వెనక్కి తిరిగి రావాల్సి ఉన్నప్పటికీ నేటివరకు వారి ఆచూకీ లభించకపోవడం ఆందోళన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. వేటకు వెళ్లిన తర్వాత మూడు రోజుల వరకు కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడిన మత్స్యకారులు, అనంతరం అందుబాటులోకి రాకపోవడంతో కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ భరోసా కల్పించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు ప్రభుత్వం వారి కుటుంబాలకు అండగా ఉంటుందని, గాలింపు చర్యలు మరింత వేగవంతం అయ్యేలా సంబంధిత అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గల్లంతైన మత్స్యకారుల జాడ కనిపించే వరకు అధికార యంత్రాంగం విశ్రాంతి లేకుండా పనిచేస్తుందని ఆయన తెలిపారు.

కోనసీమ స్టాల్‌ను పరిశీలించిన

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జి కారంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను నితిన్ నబిన్ సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ ఆయనకు ఆత్రేయపురం పూతరేకును తినిపించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన తాపేశ్వరం కాజా, మోరి జీడిపప్పు అచ్చు, కోనసీమ కొబ్బరి అచ్చులు, కోనసీమలో తయారు చేసే కొబ్బరి పీచు బొమ్మలను నితిన్ నబిన్ పరిశీలించారు. ఆయా ఉత్పత్తుల ప్రత్యేకత, తయారీ విధానం, కోనసీమకు వాటి విశిష్టత గురించి పవన్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకరమెల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంషు సాదిక్, అమలాపురం పట్టణ అధ్యక్షుడు అయ్యల భాషా, అంబాజీపేట మండల అధ్యక్షుడు కురసా ఆంజనేయులు, అయినవిల్లి మండల అధ్యక్షుడు యనమదల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా

## వర్ల రామయ్య, దళవాయి రమ

నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్లయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

27 ఏళ్లుగా అమెరికాలోనే నివాసం..

## వృద్ధురాలిని నిర్బంధించిన ఐసీఈ

సంబంధించి గతంలోనే ఇమ్మిగ్రేషన్ కోర్టు అనుకూల తీర్పు ఇచ్చినప్పటికీ, షెడ్యూల్డ్ చెకింగ్ సమయంలో అధికారులు ఆమెను అరెస్టు చేసి జార్జియాలోని నిర్బంధ కేంద్రానికి తరలించడం తీవ్ర సంచలనంగా మారింది. నార్త్ కరోలినాలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధించే ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వెంకట నరసమాంబ వాసంశెట్టి, 2013 నుంచి గ్రీన్ కార్డ్ హోల్డర్‌గా ఉన్నారు. 2022లో తన అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని పరామర్శించేందుకు భారత్‌కు వచ్చిన ఆమె, కోవిడ్ బారిన పడటంతో దాదాపు 7 నెలల పాటు ఇక్కడే ఉండాల్సి వచ్చింది. అయితే, ఆమె అమెరికా శాశ్వత నివాస హక్కును వదులుకున్నారనే ఆరోపణలతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కేసు నమోదు చేసింది. కానీ, తగిన ఆధారాలు చూపించకపోవడంతో 2026 మేలో ఇమ్మిగ్రేషన్ జడ్జి ఆ కేసును కొట్టివేశారు. కోర్టు కేసు కొట్టివేసినప్పటికీ, క్రమం తప్పకుండా ఐసీఈ చెకప్‌లకు హాజరవుతున్న వెంకట నరసమాంబను ఆగస్టు 11న నిర్వహించిన తనిఖీల్లో అధికారులు నిర్బంధించారు. ఎటువంటి నేర చరిత్ర లేని వృద్ధురాలిని చట్టవిరుద్ధంగా బంధించారని, ఆమె కుటుంబం అత్యవసర 'హెబియస్ కార్పస్' పిటిషన్ దాఖలు చేయగా, ఆమెను ఏ చట్టబద్ధమైన ప్రాతిపదికన నిర్బంధించారో 3 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఫెడరల్ జడ్జి ఐసీఈ అధికారులను ఆదేశించారు.

## దేవాలయ ఉద్యోగాల్లో రాయలసీమకు అన్యాయం జరగలేదు

ఏకంగా 172 పోస్టులను రాయలసీమ ప్రాంతంలోని ప్రధాన దేవాలయాల్లోనే నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. శాసనసభలో దేవాలయాల్లో పోస్టుల భర్తీకి సంబంధించి సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి వివరంగా సమాధానమిచ్చారు. ఈ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ఎలాంటి జోనల్ విధానం అమల్లో లేదని స్పష్టం చేశారు. శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి సీమలోని ప్రముఖ క్షేత్రాల్లో ఉన్న ఖాళీలను నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రాంతంతో సంబంధం లేకుండా కేవలం వేద, ఆగమ పరిజ్ఞానం, అర్హత, ప్రతిభకే ప్రాధాన్యత ఇచ్చామని మంత్రి వివరించారు. ఎంపిక విధానం అత్యంత పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో ఇంటర్వ్యూలన్నింటినీ వీడియో రికార్డింగ్ చేయించామని పేర్కొన్నారు. రాయలసీమ జోన్-4 పరిధిలో ఇంకా ఖాళీగా ఉన్న 147 పోస్టులను కూడా త్వరలోనే నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు.

## టోకెన్ల జారీ నిలిపివేత

టోకెన్లు జారీ చేస్తారని వివరించింది. భక్తులు గమనించి సహకరించాలని కోరింది. అయితే టోకెన్ల జారీ నిలిపివేతపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా వచ్చిన వారికి వచ్చినట్లు సర్వదర్శనం చేయించే ఆలోచనతో టీటీడీ ఈ విధానాన్ని 8 వారాలుగా పరిశీలిస్తోంది.

## స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీలతో కలిసి బరిలోకి దిగుతాం : మాధవ్

గ్రామంలోనూ కమలం జెండా ఎగరేలా, స్థానిక పదవులను దక్కించుకునేలా ప్రణాళికలతో ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి ఫలాలను, మన్ కీ బాత్ వేదికగా వ్యక్తమయ్యే సందేశాలను ప్రతి ఇంటా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే విశాఖ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ... దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధనతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకున్నామని, ప్రస్తుతం అది లాభాల దిశగా ప్రయాణిస్తోందని పేర్కొన్నారు. పోలవరం నీటిని విశాఖ ప్రాంతానికి అందించే పనులు కూడా వేగవంతమయ్యాయని వివరించారు.

## 22ఏ నిషేధిత భూములు.. కట్టుకథలు నమ్మొద్దు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకున్న వారి ఆస్తులు 22ఏ జాబితాలో ఉంటే రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలిస్తారని సీఎం తెలిపారు. అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత ప్రాతిపదికన సరైన జాబితాను రూపొందిస్తారని.. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రజలు తమ భూ హక్కుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ తెలిపారు. ప్రైవేటుకు సంబంధించి ఒక్క అంగుళం భూమికి కూడా ఇబ్బంది రానివ్వబోమని చెప్పారు. 22ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దు.. ఈ విషయంలో ఊహాగానాలు, కట్టు కథలను విశ్వసించవద్దని సీఎం కోరారు.

## ఆస్పత్రికి తరలించండి : పాక్ సుప్రీం కోర్టు

జారీ చేసింది. న్యాయస్థానం ఆదేశాన్ని పీటీఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు. ఈ చర్యలు ముందే తీసుకొని ఉంటే ఆయన ఆరోగ్యం ఇంతగా క్షీణించి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇమ్రాన్ పూర్తిగా కోలుకునే వరకు ఆయన్ను ప్రైవేట్ వైద్యుల సంరక్షణలోనే ఉంచాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై పాక్ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ వైద్య నివేదికలను తాను నిపుణులతో కలిసి పరిశీలించానని.. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని వారు చెప్పారని పేర్కొన్నారు. మూడేళ్ల జైలు జీవితం, ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. 'ఇమ్రాన్ ఖాన్ నాకు 35 ఏళ్లకు పైగా తెలుసు. రాజకీయంగా ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ఆయన ఒత్తిడికి గురికాలేదు. కానీ, మూడేళ్ల జైలు జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. గత ఏడు నెలలుగా తన కుటుంబం, పార్టీ నేతలు ఎలా ఉన్నారనే విషయాలతో పాటు.. బయట కూడా అసలేం జరుగుతుందో ఆయనకు తెలియదు. అందుకే ఇమ్రాన్ రోజురోజుకు మరింత కుంగిపోతున్నారు' అని పేర్కొన్నారు. మరోవైపు, ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. పీటీఐ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. తోషాఖానా, అల్-ఖాదిర్ ట్రస్ట్ తదితర కేసుల్లో శిక్ష పడటంతో ఇమ్రాన్ ప్రస్తుతం రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

## అద్భుతంగా నిర్వహించారు

మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌తో శిర్షా నేతృత్వంలోని ఢిల్లీ ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా శిర్షా మాట్లాడుతూ "ఢిల్లీలో టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. నియామకాలు మొదలుపెట్టగానే కోర్టు కేసులు, ఫిర్యాదులు, గందరగోళంతో ప్రక్రియ మొత్తం స్తంభించిపోతుంది. అలాంటిది ఏపీలో ఇంత పెద్ద సంఖ్యలో నియామకాలు ఎలా సాఫీగా పూర్తి చేయగలిగారు?" అని మంత్రి లోకేశ్ ను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ విజయం సాధించినందుకు లోకేశ్ కు ఆయన అభినందనలు తెలిపారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ, పక్కా ప్రణాళికతో, సాంకేతికతను వాడుకుని డీఎస్సీ పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని వివరించారు. ఈ ప్రక్రియపై ప్రతిపక్షాలు అనేక ఆరోపణలు చేసినా, కోర్టులలో కనీసం ఒక్క చిన్న అక్రమం జరిగిందని కూడా నిరూపించలేకపోయాయని తెలిపారు. విద్యాశాఖ తనకు అత్యంత ఇష్టమైనదని, త్వరలోనే మరో 3 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరగడం వల్లే ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇది తాము చేపట్టిన సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించేందుకు 'లీప్' యాప్‌ను కూడా రూపొందించినట్లు వివరించారు.

చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం

ఏపీ పర్యటనలో భాగంగా ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తున్నామని శిర్షా తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి, పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) వంటి అంశాల్లో ఏపీ దేశానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. డేటాను ఇంత సమర్థవంతంగా వాడుకుని సుపరిపాలన అందిస్తున్న రాష్ట్రం ఏపీ మాత్రమేనని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక దార్శనికుడని, అభివృద్ధికి ఆయనో విశ్వవిద్యాలయం లాంటి వారని ప్రశంసించారు. "మీ విశ్వవిద్యాలయంలో మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి" అని ఆయన చమత్కరించారు. అమరావతి నిర్మాణం అద్భుతంగా ఉందని, భవిష్యత్తులో ఇది ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్, స్మార్ట్ గవర్నెన్స్ వంటి అంశాల్లో ఢిల్లీ ప్రభుత్వానికి ఏపీ సహకారం అందించాలని శిర్షా కోరారు. ఇందుకు మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించి, పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. అనంతరం ఢిల్లీ ప్రతినిధి బృందాన్ని మంత్రులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల క్రూరత్వాన్ని ప్రశంసించాలా?

ఖండించారు. దేశ విద్యార్థులతో అవాస్తవాలు చెప్పొద్దని.. వారికి కళ్లు, జ్ఞాపకశక్తి ఉన్నాయంటూ 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. "ఢిల్లీ పోలీసులను ప్రశంసించాలని మోదీ ప్రభుత్వంలోని ఒక మంత్రి అంటున్నారు. పార్లమెంటు సమీపంలో శాంతియుతంగా ఉన్న విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారు. మేకులతో కూడిన లాఠీలతో కొట్టారు. ఈ క్రూరత్వాన్ని ప్రశంసించాలా? గాయపడిన విద్యార్థులను నేను స్వయంగా కలిశాను. ఏం జరిగిందో దేశమంతా చూసింది. ఇటీవల పార్లమెంటు సమావేశాల సమయంలో కేంద్రమంత్రి అమిత్ షా కనిపించలేదు. ప్రధాని ఇప్పటివరకూ విద్యార్థులకు క్షమాపణ చెప్పలేదు. వారు తమ తప్పులను అంగీకరించరు. దేశ యువతకు అబద్ధాలు చెప్పకండి. వారికి కళ్లతోపాటు జ్ఞాపకశక్తి కూడా ఉంది" అని రాహుల్ విమర్శించారు

రిజిజు ఏమన్నారంటే?

"జంతర్‌మంతర్ వద్ద నిరసనల సమయంలో ఎవరికీ ఏమీ కాలేదు. ఈ ప్రదర్శనలో వేలాది మంది పాల్గొన్నారు. విద్యార్థుల ముసుగులో ఎంతో మంది నేరగాళ్లు చొరబడ్డారు. ఆప్, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన వారు, ఇతరులు కూడా వచ్చి.. హింసను ప్రేరేపించారు. అయినప్పటికీ, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కాంగ్రెస్ హయాంలో జరిగిన ఇలాంటి ఉద్యమాల్లో అనేక మంది మరణించారు. కానీ, ఢిల్లీలో ఇంతటి భారీ నిరసనల సమయంలోనూ పోలీసులు ఒక్క లాఠీని కూడా ఉపయోగించలేదు. పార్లమెంటు వైపు దూసుకెళ్లినప్పుడు మాత్రమే అడ్డుకున్నారు. ఈ విషయంలో ఢిల్లీ పోలీసులను ప్రశంసించాలి" అని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై రాహుల్ పైవిధంగా స్పందించారు.

## బీసీలకు 34% రిజర్వేషన్లు

వర్తింపజేయనున్నట్టు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితో, నిబంధనలకు లోబడే ఈ పెంపును అమలు చేస్తున్నామని వివరించారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన సభకు గుర్తుచేశారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. 1984లో ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'యాక్ట్ ఆఫ్ 5' కింద దాన్ని 34 శాతానికి పెంచామని తెలిపారు. తమ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, దేవేందర్ గౌడ్, అయ్యన్నపాత్రుడు వంటి లెజెండరీ నాయకులు బీసీ వర్గాల నుంచి ఎదిగారని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రోత్సాహం అందిస్తే ఎంపీటీసీ స్థాయి నేత కూడా ఎంపీగా ఎదగొచ్చని, కర్నూలు జిల్లాకు చెందిన బస్తిపాటి నాగరాజును ఎంపీగా గెలిపించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలను కూడా సీఎం ప్రకటించారు. సుస్థిర పాలన కోసం పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను మళ్లీ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం 13గా ఉన్న జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 28కి పెంచుతున్నట్లు తెలిపారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు పొందాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యవసరమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు, గ్రామీణ వృత్తులకు బీసీలే వెన్నెముక అని సీఎం కొనియాడారు. వారి నైపుణ్యానికి సాంకేతికతను జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందిస్తామని, విద్య, ఉపాధి, నైపుణ్యం ద్వారా వారిని ఉన్నత స్థానంలో నిలబెడతామని హామీ ఇచ్చారు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, అవకాశం రాక వెనుకబడినవారని, వారికి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ చారిత్రక ప్రకటన అనంతరం బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎడిటర్ వాయిస్

# జగన్ కోసం రెండో రోజూ వెయిటింగ్

డీఎస్సీపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డితో చర్చించేందుకు తాను ఎదురుచూస్తున్నానని మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 'డే 2 ఆఫ్ వెయిటింగ్ వైఎస్ జగన్ టు యాక్సెప్ట్ మై చాలెంజ్ ఫర్ ఏ డీఎస్సీ డిబేట్' అంటూ పోస్టు చేసిన లోకేశ్ ఫన్నీ మీమ్ జత చేశారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో లోకేశ్ ఈ పోస్టు చేయగా, నెటిజన్లు రికార్డు స్థాయిలో స్పందిస్తున్నారు. కేవలం నాలుగు గంటల సమయంలోనే 15 వందల మందికి పైగా ఈ పోస్టును రీపోస్టు చ చేయగా, సుమారు 10 వేల మంది పోస్టుకు లైక్ కొట్టారు. అదేవిధంగా వందల మంది కామెంట్స్ చేస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఆరోపణలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి బహిరంగ చర్చకు రావాలని మంత్రి లోకేశ్ సోమవారం అసెంబ్లీ వేదికగా చాలెంజ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే నాలుగు సార్లు తాను బహిరంగ చర్చకు రమ్మని పిలుస్తున్నా, జగన్ రెడ్డి రావడం లేదని లోకేశ్ ఆరోపించారు. ఈ క్రమంలో మంగళవారం కూడా చర్చకు సిద్ధమంటూ లోకేశ్ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. అసెంబ్లీ బయట, లోపల ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమేనంటూ లోకేశ్ చేస్తున్న ప్రకటనలు రాజకీయంగానూ హీట్ పుట్టిస్తున్నాయి.

మంత్రి లోకేశ్ చాలెంజ్ చేస్తున్నా అంటున్నా వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి నుంచి రియాక్షన్ లేకపోవడం హాట్ టాపిక్ గా మారింది. గతంలో కూడా మంత్రి లోకేశ్ ఈ తరహా ప్రకటనలు చేయగా, వైసీపీ నేతలు కూడా చర్చకు సిద్ధమంటూ ప్రకటనలు చేశారు. అయితే లోకేశ్ స్థాయికి తాము సరిపోతామని చెబుతూ, తమ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి చర్చకు రారని తేల్చిచెప్పారు. అయినప్పటికీ మంత్రి లోకేశ్ వెనక్కి తగ్గడం లేదు. జగన్ రెడ్డి మాత్రమే చర్చకు రావాలంటూ పొలిటికల్ హీట్ ను కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

మొత్తానికి మంత్రి నారా లోకేశ్ ట్వీట్ రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తోంది. డీఎస్సీపై తాను బహిరంగ చర్చకు సిద్ధం అని లోకేశ్ గర్జిస్తుంటే, లోకేశ్ స్థాయికి మాజీ మంత్రి పేర్ని నాని సరిపోతారని వైసీపీ కార్యకర్తలు కామెంట్లు చేస్తున్నారు. ఇదే సమయంలో లోకేశ్ సవాల్ పై వైసీపీ పార్టీ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. డీఎస్సీపై చర్చిద్దామని మంత్రి లోకేశ్ రెండు రోజులుగా పిలుపునిస్తున్నప్పటికీ వైసీపీ నాయకులు ఎవరూ మాట్లాడలేదని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. ఇదే సమయంలో ఆ పార్టీ నేతలు మండలి వేదికగా ప్రభుత్వంపై గట్టి పోరాటమే చేస్తున్నారని అంటున్నారు.




ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైమ్ వాయిస్

# ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య..

### వెలుగులోకి అల్లుడి హత్య కేసు?



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి ఫిర్యాదుతో సాధిక్‌ఖాన్‌పై మరో కేసు నమోదైంది. జులై 2న తన కుమారుడు జగదీశ్‌రెడ్డికి పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి సాధిక్ హత్య చేశాడని భాస్కర్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. హత్య కేసులో సాధిక్‌తో పాటు మరో వ్యక్తి పాత్ర ఉన్నట్టు అనుమానం వ్యక్తంచేశారు. సాధిక్ కారణంగానే నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకుందని ఇప్పటికే కేసు నమోదైంది. నిన్న మనవడు కార్తికేయరెడ్డితో మాట్లాడగా విషయం తెలిసిందని భాస్కర్‌రెడ్డి పోలీసులకు తెలిపారు. నూకరాజు కుమార్తె సౌజన్య బండిలో మూడు కవర్లను పోలీసులు గుర్తించారు. జగదీశ్‌రెడ్డి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సౌజన్య రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "సాధిక్ ఖాన్ నన్ను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేశాడు. నా భర్తను సాధిక్ హత్య చేశాడు. నా ఆస్తి, ఫోన్, ఎస్‌బీఐ లాకర్ వివరాలు తీసుకున్నాడు. మతం మారాలని ఒత్తిడి చేశాడు. నా కుటుంబాన్ని చంపుతానని బెదిరించాడు. సాధిక్ వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నాం" అని లేఖలో పేర్కొన్నట్టు సమాచారం. కేసు నమోదు చేసిన సర్పవరం పోలీసులు సాధిక్‌ఖాన్ కోసం ఇప్పటికే గాలిస్తున్నారు. మరోవైపు.. నిన్న గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఏఈ నూకరాజు భార్య మీనా, కుమార్తె సౌజన్య కోసం ఎస్‌డీఎఆర్‌ఎఫ్ బృందం, పోలీసులు, గజ ఈతగాళ్లు గాలింపు కొనసాగిస్తున్నారు.

**ఏం జరిగిందంటే? :** కాకినాడ అశోకనగర్‌లో నివాసముంటున్న తిల్లపూడి నూకరాజు (61) పిఠాపురం మండలంలో పంచాయతీరాజ్ ఏఈగా గత పదేళ్లుగా విధులు నిర్వరిస్తున్నారు. వచ్చే జనవరిలో ఆయన ఉద్యోగ విరమణ చేయాల్సిఉంది. ఆదివారం అర్ధరాత్రి భార్య మీనా (58), కుమార్తె కోవూరి సౌజన్య (38), మనుమడు రియాన్ష్ కార్తికేయరెడ్డి(10)తో కలిసి కారులో రాజమహేంద్రవరం వచ్చారు. రోడ్డు కం రైలు వంతెనపై కారు నిలిపి నలుగురూ గోదావరిలో దూకేశారు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వెంటనే సమీప లంకల్లోని మత్స్యకారులను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈత వచ్చిన కార్తికేయ దాదాపు 20 నిమిషాల పాటు గోదావరిలో ఈదుతూ హెల్ప్‌హెల్ప్ అని అరిచాడు. మత్స్యకారులు బాలుణ్ని గమనించి వెంటనే పడవలో ఒడ్డుకు చేర్చారు. కాలు, నడుంపై స్వల్పగాయాలైన కార్తికేయకు పోలీసులు ఓ ఆసుపత్రిలో చికిత్స అందించి, బంధువులకు అప్పగించారు. మిగతావారి కోసం అగ్నిమాపక శాఖ సిబ్బంది, గజ ఈతగాళ్లు ప్రత్యేక బోట్లతో గోదావరిలో గాలింపు చేపట్టారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు నూకరాజు మృతదేహం రాజమహేంద్రవరంలోని దోబీఘాట్ వద్ద లభించింది.

**సాధిక్ ఖాన్ వేధింపులు భరించలేకే చనిపోతున్నాం..** కాకినాడకు చెందిన ప్రో రైఫిల్ షూటింగ్ నిర్వాహకుడు షేక్ సాధిక్‌ఖాన్ వేధింపులు, హింస భరించలేక తామంతా చనిపోవాలని నిర్ణయించుకున్నామని నూకరాజు లేఖ రాశారు. 'నా అల్లుడు జులై 2న మరణించాడు. ఆ తరువాత నా కుమార్తెకు సహాయంగా ఉంటానని సాధిక్ ప్రతిపాదించాడు. మేం అంగీకరించలేదు. ఐదో తరగతి చదువుతున్న నా మనవణ్ని, నన్ను చంపుతానని మా అమ్మాయిని బెదిరించి విలువైన వస్తువులు, బ్యాంకు ఖాతాలు అతని అధీనంలోకి తీసుకున్నాడు. పరువుగా బతికిన మా అమ్మాయిని చాలా హింసిస్తున్నాడు. మేం ఏమైనా చెబితే చంపుతానంటున్నాడు. ఇదంతా తట్టుకోలేక నేను, నా భార్య, కుమార్తె, మనవడితో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నా. ఆ దుర్మార్గుణ్ని కఠినంగా శిక్షించాలి' అని కలెక్టర్, ఎస్పీలను కోరుతూ రాసిన లేఖను ఆయన వాట్సప్‌లో సహోద్యోగులు, మరికొందరికి పంపించారు.

# తాడిపత్రిలో భారీగా గోవా మద్యం పట్టివేత



**తాడిపత్రి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా తాడిపత్రిలో భారీగా గోవా మద్యం పట్టుబడింది. గోవా నుంచి తాడిపత్రికి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. తాడిపత్రి రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న లారీని పోలీసులు తనిఖీ చేశారు. లారీ క్యాబిన్ వెనుక భాగంలో కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌ను గుర్తించిన పోలీసులు.. అందులో భారీగా మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. దాదాపు 400 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లారీకి రెండు నంబర్ ప్లేట్లు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. ఒకటి కర్ణాటక రాష్ట్రానికి చెందిన నంబర్ ప్లేట్ కాగా.. మరోటి ఏపీ నంబర్ ప్లేట్ ఉన్నట్లు గుర్తించారు. తాడిపత్రి పట్టణ సీఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టి లారీతో పాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం రవాణా వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు ఆరా తీస్తున్నారు.

# వాట్సప్‌లో గంజాయి ఆర్డర్లు.. డ్రగ్స్ ముఠా అరెస్ట్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వాట్సప్‌లో గంజాయి ఆర్డర్లు తీసుకుని సప్లై చేస్తున్న ముఠాను తెలంగాణ ఈగల్ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాలో ఐదుగురు డ్రగ్ కింగ్‌పిన్‌లను అరెస్ట్ చేశారు. పోలీసులు ఏకకాలంలో 188 ప్రాంతాల్లో సోదాలు చేశారు. పట్టుబడిన గంజాయి వినియోగదారుల్లో ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. గంజాయి ఆర్డర్ పెట్టిన వారిలో 100 మందికి డ్రగ్ టెస్టులు చేయగా, 80 మందికి పాజిటివ్‌గా తేలింది. 36 గంటల నాన్‌స్టాప్ ఆపరేషన్‌తో భారీ డ్రగ్ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు. గంజాయి వినియోగదారులు ఫోన్‌పేలో చెల్లింపులు చేసినట్లు విచారణలో తేలింది. నిందితులు గూగుల్‌మ్యాప్ లోకేషన్ ద్వారా డెడ్‌డ్రాప్ పద్ధతితో డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఓ బాలుడు ఉండడంతో నోటీసులు ఇచ్చారు.

# విశాఖ షీలానగర్‌లో దారుణం..

### మూడు మృతదేహాలు లభ్యం

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ షీలానగర్‌లో దారుణం చోటుచేసుకొంది. షీలానగర్–గాజువాక మార్గంలో మట్టిలో మూడు మృతదేహాలు బయటపడటం స్థానికంగా కలకలం రేపింది. షీలానగర్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న షీలానగర్ – సబ్బవరం పోర్టు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణ పనుల కోసం తెచ్చిన మట్టి నుంచి ఈ మృతదేహాలు బయటపడ్డాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలు ఎవరివన్న కోణంలో విచారణ చేపట్టారు.



# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు







# గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ముమ్మరంగా గాలింపు

## కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీసుల సమన్వయంతో సహాయక చర్యలు - కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దు : జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

**అమలాపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం అధికార యంత్రాంగం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. కోస్ట్‌గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, సివిల్ పోలీస్, మత్స్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సముద్రంలో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో కలిసి నిర్వహించిన పత్రికా సమావేశంలో గాలింపు, సహాయక చర్యల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. ఆగస్టు 3వ తేదీ సాయంత్రం ఏడుగురు మత్స్యకారులు ఎం౦ 135 రిజిస్ట్రేషన్ నంబరు గల సుమారు 12 మీటర్ల పొడవైన బోటులో ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లారని తెలిపారు. సాధారణంగా 12 రోజుల వేట అనంతరం ఆగస్టు 15 లేదా 16 తేదీల్లో తిరిగి రావాల్సి ఉండగా, ఆగస్టు 5వ తేదీ వరకు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. అనంతరం వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బోటులో వీహెచ్‌ఎఫ్ సెట్ ఉన్నప్పటికీ ట్రాన్స్‌పాండర్ లేదని, తీరం నుంచి సుమారు 120 నుంచి 150 కిలోమీటర్ల దూరంలో దీర్ఘదూర సముద్ర వేటకు వెళ్లిన నేపథ్యంలో గాలింపు పరిధిని విస్తరించినట్లు కలెక్టర్ తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం పరిధిలో సముద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకలకు బోటుకు సంబంధించిన పూర్తి వివరాలను అందించి అప్రమత్తం చేసినట్లు చెప్పారు. ఇండియన్ నేవీతో కూడా సమన్వయం చేసుకుని గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు ఈశాన్య లేదా వాయువ్య దిశగా వేటకు వెళ్లి ఉండే అవకాశం ఉన్నందున కాకినాడ, ఉప్పాడ తదితర తీర ప్రాంతాల్లోని మత్స్యకార సంఘాలు, ఆయా



జిల్లాల మత్స్యశాఖ అధికారులను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సముద్రంలో వేటకు వెళ్లిన ఇతర మత్స్యకార బోట్లకు కూడా గల్లంతైన బోటు వివరాలను తెలియజేసి, ఆచూకీ లభించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం పోలీస్ శాఖ తరఫున అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అల్లవరం పోలీస్ స్టేషన్‌లో గల్లంతైన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశామని చెప్పారు. మత్స్యకారుల ఫోన్ నంబర్లకు సంబంధించిన కాల్ డేటా రికార్డులు, అందుబాటులో ఉన్న ఇతర సాంకేతిక సమాచారాన్ని విశ్లేషిస్తూ వారి ఆచూకీ గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మెరైన్ పోలీస్, కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులతో పోలీస్ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని, వారి ఆచూకీ లభించే వరకు పోలీస్ శాఖ తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. సముద్రంలో వేటకు వెళ్లే కొన్ని బోట్లు వాతావరణం, సముద్ర పరిస్థితులు, వేట పరిస్థితుల ఆధారంగా 15 నుంచి 20 రోజుల వరకు సముద్రంలోనే ఉండి తిరిగి వచ్చే సందర్భాలు ఉంటాయని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి గాలింపు చర్యలను వేగవంతం చేసిందని కలెక్టర్ తెలిపారు. రానున్న రెండు మూడు రోజుల్లో మత్స్యకారుల ఆచూకీ లభించి వారు క్షేమంగా తిరిగి వస్తారనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, మత్స్యకారులను సురక్షితంగా తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా భరోసా ఇచ్చారు. గాలింపు చర్యలకు సంబంధించిన తాజా సమాచారం, పురోగతిని ప్రతిరోజూ సాయంత్రం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా మీడియా, ప్రజలకు తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు అన్ని శాఖలు సమన్వయంతో గాలింపు, సహాయక చర్యలను నిరంతరం కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ సహాయ సంచాలకుడు కరుణాకర్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం..

# వేగాయమ్మపేటలో నరకప్రాయ జీవనం!

వేగాయమ్మపేట : విశ్వం వాయిస్ న్యూస్

### ఆరు నెలలుగా వీధి దీపాలు బంద్.. పేరుకుపోయిన చెత్త.. పొంచి ఉన్న ప్రమాదాలు

**అరుంధతిపేటపై ఎందుకీ వివక్ష?**

- డ్రైనేజుల్లో పేరుకుపోయిన మురుగు
- వేలాడుతున్న విద్యుత్ తీగలతో భయం
- చెత్తను ప్రజలే తొలగించుకునే దుస్థితి



వేగాయమ్మపేటలో పారిశుద్ధ్య దుస్థితికి నిదర్శనం

**వేగయమ్మ పేట, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట గ్రామస్తులు అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన గ్రామ పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైంది. పారిశుద్ధ్య లోపం, వీధి దీపాల లేమి, ప్రాణాలు తీసేలా వేలాడుతున్న కరెంటు తీగలతో గ్రామస్తులు ప్రతిరోజూ నరకం చూస్తున్నారు.

**చీకట్లో భయం భయం.. అధికారుల నిర్లక్ష్యం**

గ్రామం నుంచి బయటకు వెళ్లే ప్రధాన మార్గంలో సుమారు అర కిలోమీటర్ మేర గత ఆరు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. చీకటి పడితే చాలు పాములు, విషకీటకాలు రోడ్లపైకి వస్తుండటంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. రహదారికి ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించే కనీస బాధ్యతను కూడా పంచాయతీ అధికారులు విస్మరించారు. దీనిపై పంచాయతీ సెక్రటరీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, “అది మా పరిధిలోకి రాదు, మాకు సంబంధం లేదు” అంటూ అత్యంత బాధ్యతారాహిత్యంగా సమాధానాలు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

**వేలాడుతున్న మృత్యుపాశాలు**

ఇక గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం సైతం పంచాయతీ అధికారులకు తోడైంది. ఇటీవల గ్రామంలో 11 కేవీ కేబుల్ వైర్లు లాగిన సిబ్బంది, ఆ పనుల తాలూకు చెత్తను ఎక్కడికక్కడే రోడ్లపైనే వదిలేసి వెళ్లారు. పంచాయతీ సిబ్బంది సైతం ఆ చెత్తను తొలగించే ప్రయత్నం చేయలేదు. మరోవైపు గ్రామంలో విద్యుత్ తీగలు పూర్తిగా కిందికి వేలాడుతున్నాయి. కొన్నిచోట్ల చెట్ల కొమ్మల మధ్య నుంచి వెళ్లిపోతుండగా, మరికొన్ని చోట్ల చేతికి అందేంత ఎత్తులో, ఇళ్ల పైభాగంలో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని, ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు మండిపడుతున్నారు.

**అరుంధతిపేటపై ఈ వివక్ష ఎందుకు?**

పారిశుద్ధ్యం విషయంలో గ్రామ పంచాయతీ అధికారుల తీరు తీవ్ర విమర్శలపాలవుతోంది. ఊరంతా ప్రతిరోజూ డ్రైనేజీలు శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది, అరుంధతిపేటలో మాత్రం కనీసం వారానికి, పది రోజులకోసారి కూడా శుభ్రం చేయడం లేదు. “ఊరందరికీ ఒక న్యాయం, మాకు మరో న్యాయమా? మా పేటపై ఎందుకీ వివక్ష?” అంటూ అరుంధతిపేట వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వారి చెత్త వారే ఎత్తుకుంటున్న ప్రజలు**

రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్నా పంచాయతీ అధికారులు స్పందించడం లేదు. స్థానికంగా నెలకొన్న అపరిశుభ్రత కారణంగా రోగాల బారిన పడతామన్న భయంతో, విధిలేని పరిస్థితుల్లో స్థానికులే స్వయంగా తమ చేతులతో చెత్తను ఎత్తుకుని రోడ్లను శుభ్రం చేసుకుంటున్న దయనీయ పరిస్థితి వేగాయమ్మపేటలో నెలకొంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

కళ్లెదుటే ఇన్ని సమస్యలు కనిపిస్తున్నా పంచాయతీ అధికారులు నిద్రమత్తు వీడటం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వేగాయమ్మపేటలో నెలకొన్న విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.


స్థానిక సంస్థల ఎన్నికలలో

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

### హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే దివ్య



**కోటనందూరు, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయాన్ని ప్రభుత్వ విప్ యనమల దివ్య స్వాగతించారు. ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన యనమల దివ్య బీసీ మంత్రులు సహచర శాసన సభ్యులతో కలిసి అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు.తెలుగుదేశం పార్టీ బీసీల పక్షపాతని అప్పుడు ఇప్పుడు వెనుకబడిన తరగతులకు రాజకియంగా సముచిత స్థానం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కేబినెట్ నిర్ణయం వల్ల త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వాటా పెరుగుతుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు.

### మంత్రి సుభాష్ కృషితో నాలుగు దశాబ్దాల

# కబేలా సమస్యకు శాశ్వత పరిష్కారం

**ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేసిన మంత్రి - కబేలా మూసివేతకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలు**

**గతంలో ఎవరూ చేయలేని పని చేసి చూపిన మంత్రి వాసంశెట్టి సుభాష్**

**కబేలా ప్రాంతాన్ని సందర్శించిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, అధికారులు**



**రామచంద్రపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం రామచంద్రపురం రూరల్ మండలం చోడవరం గ్రామంలో గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతున్న కబేలా (పశు వధశాల) సమస్యకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో ఎట్టకేలకు శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమమైంది. మంత్రి సుభాష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కబేలా మూసివేతకు, విద్యుత్ సరఫరా నిలిపివేతకు ఆదేశాలు జారీ చేయడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చోడవరం ప్రాంతంలోని కబేలాల వల్ల సంవత్సరాలుగా దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత నాలుగు దశాబ్దాలుగా ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. అయితే రామచంద్రపురం ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి సుభాష్ దృష్టికి ఈ సమస్యను ప్రజలు పెద్ద ఎత్తున తీసుకురావడంతో, సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి, ప్రజల విజ్ఞప్తులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో కబేలా మూసివేత ప్రక్రియకు శ్రీకారం చుట్టబడింది.

**కబేలా ప్రాంతంలో అధికార యంత్రాంగం విస్తృత చర్యలు**

మంగళవారం పోలీసుల బందోబస్తు నడుమ మున్సిపల్, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కబేలా ప్రాంతానికి చేరుకుని చర్యలు చేపట్టారు. జేసీబీల సహాయంతో అక్కడ పేరుకుపోయిన పశు వ్యర్థాలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. శానిటరీ సిబ్బంది ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులో తిరిగి పశువధ జరగకుండా కబేలా ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. దీంతో కబేలా కంపు సమస్యకు పూర్తిస్థాయిలో ముగింపు పలికే దిశగా అడుగులు పడ్డాయి.

**కబేలా నిర్వాహకులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి - మంత్రి సుభాష్ హామీ**

**మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం మాటపై నమ్మకం ఉంది - కబేలా నిర్వహకుడు**

ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాకుండా, కబేలా నిర్వహణపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకున్న మంత్రి సుభాష్, కబేలా నిర్వాహకులు చుట్టుగుళ్ల యోషయా, కొత్తూరు చిట్టెమ్మ (మోషే) లతో చర్చలు జరిపారు. వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న మంత్రి సుభాష్ విజయవాడ నుంచి ఫోన్ ద్వారా కబేలా నిర్వాహకుడు చుట్టుగుళ్ల యోషయాతో మాట్లాడి, అదే ప్రాంతంలో డైరీ ఫారం ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన అన్ని అనుమతులు, ప్రభుత్వ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే వాసంశెట్టి సత్యం కూడా నిర్వాహకులతో మాట్లాడి వారి జీవనోపాధికి భరోసా కల్పించారు. ఇరువురు మాటలకు సంతృప్తి వ్యక్తం చేసిన యోషయా మాట్లాడుతూ మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఇంతకాలంలో ఎవరూ ఇలా భరోసా ఇవ్వలేదని, మంత్రి సుభాష్ ప్రజా పాలన పై తనకు అపారమైన నమ్మకం ఏర్పడిందని, వారి మాటలు శిరసా వహిస్తూ అంగీకరించి, కబేలా నిర్వహణను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

**కబేలా ప్రాంతాన్ని సందర్శించిన వాసంశెట్టి సత్యం**

మంత్రి సుభాష్ అసెంబ్లీ సమావేశాల్లో ఉండటంతో, ఆయన తండ్రి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం కూటమి నాయకులతో కలిసి కబేలా ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సమస్యను మంత్రి సుభాష్ పరిష్కరించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా, అనేక మంది రాజకీయ నాయకులు హామీలు ఇచ్చినా సాధ్యం కాని పనిని మంత్రి సుభాష్ చేసి చూపించారని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ద్రాక్షారామం వచ్చే భక్తుల సౌకర్యం కోసం తీసుకున్న ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

**ప్రజల ఆనందానికి అవధులు లేవు-**
**మంత్రి సుభాష్‌కు ప్రజలుకృతజ్ఞతలు**

నాలుగు దశాబ్దాలుగా రామచంద్రపురం ప్రజలను పట్టిపీడిస్తున్న కబేలా సమస్యకు మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో పరిష్కారం లభించడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "గతంలో ఏ రాజకీయ నాయకుడు చేయలేని పని మంత్రి సుభాష్ చేసి చూపించారు" అంటూ ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి సుభాష్ మరోసారి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం డిఎస్పి ఎం.శేషు, తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, సీఐ వెంకటనారాయణ, ఎస్సై నాగేశ్వరరావు, మున్సిపల్, పశుసంవర్ధక శాఖ, పొల్యూషన్ బోర్డ్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### అమలాపురంలో ఆగస్టు 20న పీఎం విశ్వకర్మ

# అవగాహన కార్యక్రమం, రుణ మేళా

**అమలాపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు బ్రాండింగ్, మార్కెటింగ్, డిజిటల్ పరిజ్ఞానం, వ్యాపారాభివృద్ధి, బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించేందుకు భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి, సులభతరీకరణ కార్యాలయం, విశాఖపట్నం ఆధ్వర్యంలో ఆగస్టు 20న అమలాపురంలో అవగాహన కార్యక్రమం, పీఎం విశ్వకర్మ రుణ మేళా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమలాపురంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్, సిటీ కేబుల్ స్ట్రీట్, క్లాక్ టవర్ వెనుక భాగంలో జరుగుతుంది.

**వ్యాపారాభివృద్ధిపై అవగాహన**

కార్యక్రమంలో వ్యాపారాభివృద్ధి, ధర నిర్ణయం, మార్కెట్ ధోరణులు, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, విక్రయ వ్యూహాలు, ఉత్పత్తుల ప్యాకేజింగ్, లేబులింగ్, రూపకల్పన తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ఆన్‌లైన్ విక్రయాలు, ఈ-కామర్స్ వేదికల్లో నమోదుపై కూడా మార్గదర్శకత్వం అందిస్తారు. పీఎం విశ్వకర్మ ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్ కోసం కృత్రిమ మేధస్సు వినియోగంపై ప్రత్యేక శిక్షణతో పాటు ప్రాయోగిక శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్ర స్థాయి పీఎం విశ్వకర్మ పర్యవేక్షణ విభాగాలు సహకరించనున్నాయి. అలాగే ఉద్యమ్ నమోదు, ఉద్యమ్ అసిస్ట్, క్యూఆర్ కోడ్ తయారీ, ఎగుమతుల ప్రోత్సాహం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై కూడా అవగాహన కల్పిస్తారు.

**పీఎం విశ్వకర్మ రుణ మేళా**

మధ్యాహ్నం నిర్వహించే రుణ మేళాలో ప్రధాన జిల్లా బ్యాంకు మేనేజర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొంటారు. లబ్ధిదారులు వారితో నేరుగా మాట్లాడి తమ రుణ అవసరాలు, రుణ ప్రక్రియ, రుణాలకు సంబంధించిన సమస్యలపై మార్గదర్శకత్వం పొందవచ్చు.

**ఎవరు పాల్గొనవచ్చు?**

మూడో దశ ధ్రువీకరణను విజయవంతంగా పూర్తి చేసుకున్న పీఎం విశ్వకర్మ లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. ముఖ్యంగా రుణ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. లబ్ధిదారులు పీఎం విశ్వకర్మ గుర్తింపు కార్డు లేదా ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. ఈ కార్యక్రమంలో గరిష్ఠంగా 100 మంది లబ్ధిదారులకు మాత్రమే అవకాశం ఉంటుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పరిసర ప్రాంతాలకు చెందిన అర్హత కలిగిన పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు హాజరై శిక్షణ, మార్కెటింగ్ మార్గదర్శకత్వం, రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి, సులభతరీకరణ కార్యాలయం, విశాఖపట్నం అధికారులు కోరారు. మరింత సమాచారం కోసం: చంద్ర మౌళి జంగం, సహాయ సంచాలకులు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి, సులభతరీకరణ కార్యాలయం, విశాఖపట్నం. ఫోన్: 8123371266

# దివ్యాంగులకు నేరుగా రవాణా సేవలు

**వాట్సాప్ ద్వారా లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ సదుపాయం**



**అమలాపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగులు రవాణా శాఖకు సంబంధించిన సేవలను నేరుగా పొందేందుకు వాట్సాప్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ఇంటి నుంచే అవసరమైన సేవలను పొందేందుకు ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన మొబైల్ వాట్సాప్ నంబర్‌ను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. మూడు చక్రాల మోటార్‌సైకిళ్లు కలిగి ఉన్న దివ్యాంగులు లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన స్లాట్ బుకింగ్ కోసం 92816 07021 నంబర్‌ను సంప్రదించవచ్చని జిల్లా రవాణా అధికారి తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్‌తో పాటు లైసెన్స్ స్లాట్ బుకింగ్‌కు సంబంధించిన వివరాలను కూడా ఈ వాట్సాప్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. గత నెల రోజుల వ్యవధిలో జిల్లాలో 16 మంది దివ్యాంగులు మూడు చక్రాల స్కూటర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు లెర్నింగ్ లైసెన్స్‌లు పొందినట్లు తెలిపారు. దివ్యాంగులకు రవాణా శాఖ అందిస్తున్న సేవలు మరింత సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ఈ సదుపాయాన్ని వినియోగంలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. దివ్యాంగులు తమ వాహనాల రిజిస్ట్రేషన్, లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ తదితర అవసరాల కోసం మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా రవాణా శాఖను సంప్రదించాలని కోరారు. ఇందుకోసం 92816 07021 వాట్సాప్ నంబర్‌ను వినియోగించుకుని రవాణా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

# కుష్టు రోగుల సమస్యకు పరిష్కారం ఎప్పుడు

**హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా - జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం.దొరబాబు డిమాండ్**



**రామచంద్రపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం లో గత 42 రోజుల నుండి కుష్టు రోగుల సంఘం న్యాయ దీక్ష చేస్తున్న విషయం నియోజకవర్గ ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు. కుష్టు రోగుల సంఘం ఇప్పటికే జిల్లా కలెక్టర్ వారికి జిల్లా ఎస్పీ వారికి నియోజకవర్గపు అధికారులకు విన్నవించుకున్న మా గోడు ఎవరు పట్టించుకోవడంలేదని స్థానిక మంత్రివర్యులు అలాగే వారి తండ్రి గారి దృష్టికి తీసుకు వెళ్లినా ఇప్పటివరకు మాకు ఏ విధమైన న్యాయం జరగలేదని వారు తెలియజేశారు. ప్రతిరోజు మేము అడుక్కొని పొట్ట గడుపుకునే వారమని గత 42 రోజుల నుంచి మేము ఈ న్యాయపరమైన దీక్షలో ఉన్నామని చాలా దయనీయమని పరిస్థితిలో మేము బ్రతుకుచున్నామని మండుచున్న మండు ఎండలో దీక్ష చేస్తున్నామని చాలామందికి వైద్యం లేక చాలా బాధపడుతున్నారని ఈ సందర్భంగా దీక్షలో ఉన్న నిర్వాహకులు తెలియజేశారు. ఒక ప్రక్క మా వ్యాధితో బాధపడుతూ మరొక ప్రక్క ఆకలితో మాడిపోతూ దయానీయమైన స్థితిలో పోరాటం చేస్తున్నామని తెలియజేశారు. రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు అలాగే ఉద్యమకారులు నియోజకవర్గంలో ఎక్కడైనా ఏదైనా జరిగితే వెంటనే స్పందించే వారందరూ మాలాంటి వారి సమస్యలపై స్పందించడం లేదని వారి బాధను వ్యక్తం చేశారు. సమాజంలో మేమంటే చిన్న చూపు అంటరాని వాళ్ళుగా చూస్తూ నా సమస్యను ఎవరో పట్టించుకోవడంలేదని కన్నీరు మున్నీరు అవుతున్నారు. వివరాలు తెలుసుకున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం దొరబాబు మాట్లాడుతూ ఇది చాలా దారుణమని సమాజంలో ఇలాంటి వారి సమస్యలపై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగు చర్య తీసుకోవాలని మండుటెండలో 42 రోజుల నుంచి న్యాయ దీక్ష చేస్తున్న కుష్టు రోగుల సంఘం సమస్యను పరిష్కరించే దిశగా రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు సామాజిక కార్యకర్తలు ఉద్యమకారులు దీనిపై దృష్టి ఉంచి త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో రామచంద్రపురం రాజుగారు ఈ స్థలాన్ని కుష్టు రోగుల వైద్యం నిమిత్తం ఆరోగ్య కేంద్రం కొరకు మిషనరీల వారికి దానంగా ఇచ్చారని వారు అనంతరం టీ ఎల్ ఎం అనే సంస్థ వారికి ఈ ఆరోగ్య కేంద్రాన్ని అప్పగించారని వారు రాను రాను దీనిని మూసి వేశారని అప్పటినుంచి కుష్టు రోగులు వైద్యం కొరకు చాలా బాధపడుతున్నారని సుమారు చుట్టు ప్రక్కల గ్రామాలు కలుపుకొని 500 మంది కుష్టు రోగులు ఉన్నారని వారి వైద్యం అందక చాలా బాధలు పడుతున్నారని వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని తెరిచేలా అందరూ కృషి చేసి వారికి వైద్యం అందించేలా చూడాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. వారి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని తెలియజేశారు.

### హోంగార్డ్ యూనిట్లను

# వార్షిక తనిఖీ చేసిన కమాండెంట్ ఏ.జోషి





**అమలాపురం, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా హోంగార్డ్ యూనిట్లను వైజాగ్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఏ. జోషి మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన ఆయనకు హోంగార్డ్ సిబ్బంది పరేడ్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. పరేడ్ అనంతరం హోంగార్డ్ కార్యాలయంలోని రికార్డులను కమాండెంట్ ఏ. జోషి తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హోంగార్డుల పనితీరు, బీమా ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. హోంగార్డుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా, ఐ.పి.ఎస్.ను మర్యాదపూర్వకంగా కలిసి హోంగార్డుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ డీఎస్పీ కె. రెడ్డప్పరెడ్డి, రాజమహేంద్రవరం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, హోంగార్డ్స్ ఆర్ఐ ఎన్. బ్రహ్మానందం, ఏఆర్ ఎస్ఐ కె.వి. ప్రసాద్‌తో పాటు హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



# నేటి నుండి యనమల గార్డెన్లో వరుణ యాగాలు

## కుల మత ప్రాంతాలకతీతంగా అందరికీ ఆహ్వానం
## రైతు సుభిక్షంగా ఉంటేనే సమాజం బాగుంటుంది - యనమల రామకృష్ణుడు మాజీ మంత్రి

**కోటనందూరు, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎలిమినో వలన వర్షా బావ పరిస్థితులు దృష్ట్యా వ్యవసాయంపై పెను ప్రమాదం చూపిస్తుందని ఈపరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వాలతో పాటు మానవ ప్రయత్నాలు కూడ ఉండాలని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు.రైతు సుభిక్షంగా ఉంటేనే సమాజం క్షేమంగా ఉంటుందని ఆయన అన్నారు. ముందెన్నడూ లేని విధంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతుల శ్రేయస్సు కోసం అన్నదాతల భాగస్వామ్యంతో వరుణ యాగం తలపెట్టామని యనమల పేర్కొన్నారు.ఈనెల 19 నుంచి నాలుగు రోజులపాటు వేద మంత్రోచ్చారణ ల మధ్య యనమల గార్డెన్స్ లో వరుణ యాగం ఋత్వికుల వేదమంత్రాలతో పూజా కార్యక్రమాలు కొనసాగుతా



యన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతులు చేపట్టిన వరుణయాగానికి కులమతాలకు అతీతంగా అందరూ విచ్చేయాలని ఆయన ఆహ్వానించారు.ఇది మానవ ప్రయత్నం.. యజ్ఞయాగాలు చేపట్టడం మన ధర్మం.భగవంతుడు కరుణ చూపించి వర్షాలు సమృద్ధిగా కురవాలని యనమల ఆకాంక్షించారు. కాకినాడ జిల్లా తుని నియోజవర్గం నలు దిశలా పీసీసీ,పుష్కర,పంపా జలాశయాలు ఉన్నప్పటికీ తగిన స్థాయిలో నీటి నిల్వలు లేనందున వర్షాలు పడితే తప్పా ఖరీఫ్ ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదని వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ఈమహా యజ్ఞం రైతులు చేసేందుకు ముందుకు వచ్చారని యనమల చెప్పారు.వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు.

### తాడేపల్లిలో జగన్‌ను కలిసిన

# మండపేట వైసీపీ నేత పలివెల సుధాకర్


## పార్టీ పటిష్టతకు అందరూ కలిసి పనిచేయాలి : జగన్ – కూటమి ప్రభుత్వ అరాచకాలపై పోరాడాలని పిలుపు



**మండపేట టౌన్, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ని తాడేపల్లిలోని ఆయన నివాసం లో వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్, పార్టీ నాయకులు పైడిమల్ల,రాజు ఖండవిల్లి వీర్రాజు తదితరులు జగన్ని కలిసి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.ఈ సందర్భంగా పలివెల సుధాకర్ మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా జగన్ దిశానిర్దేశం చేశారని తెలిపారు. పార్టీ పటిష్టత కోసం నాయకత్వంలో అందరూ కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేయాలని జగన్ సూచించారని సుధాకర్ పేర్కొన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజలపై భారాలు మోపుతోందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అన్యాయాలపై ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన నిలబడి పోరాడాలనీ జగన్ సూచించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వీధుల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి చుక్కలు చూపించాలని జగన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని సుధాకర్ తెలియజేశారు.ఈ భేటీతో మండపేట నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో మరింత కృషి చేస్తామని నేతలు అన్నారు.

# ఈస్ట్ జోన్ సబ్-డివిజన్ క్రైమ్ సమావేశం

## పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి : డీఎస్పీ విద్యా



**మండపేట, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డిఎస్పి బి.విద్యా ఆధ్వర్యంలో మంగళవారం మండపేట మండలం ఇప్పన పాడు గ్రామాల్లో ఉన్న రూరల్ పోలీస్ స్టేషన్‌లో సబ్–డివిజన్ క్రైమ్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అనపర్తి సర్కిల్, మండపేట రూరల్, మండపేట టౌన్ పరిధిలోని కేసుల దర్యాప్తు పురోగతిని డి ఎస్ పి సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కేసుల దర్యాప్తును నాణ్యతతో, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి బాధితులకు తక్షణ న్యాయం అందించాలని సూచించారు. దర్యాప్తులో ఎలాంటి జాప్యం ఉండకూడదని, అవసరమైన ఆధారాలను వెంటనే సేకరించాలని ఆదేశించారు. నేర నియంత్రణలో భాగంగా ముందస్తు సమాచార సేకరణను బలోపేతం చేయాలని, రౌడీషీటర్లు, నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, బాలల భద్రతతో పాటు సైబర్ నేరాల అదుపుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో సి సీ టి ఎన్ ఎస్ , ఈ సాక్ష్య, సి ఇ ఐ ఆర్, ఈ సమన్స్, వంటి స్మార్ట్ పోలీసింగ్ విధానాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.రికార్డుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ క్రైమ్ మీటింగ్‌లో అనపర్తి సిఐ వి.సుమంత్, మండపేట టౌన్ సిఐ డి సురేష్, మండపేట రూరల్ సిఐ పి దొర రాజు, అనపర్తి ఎస్ఐ వినయ్ ప్రతాప్, బిక్కవోలు ఎస్ ఐ రవి చంద్ర, రంగంపేట ఎస్ ఐ శివప్రసాద్, మండపేట రూరల్ ఎస్ఐ వి కిషోర్, అంగర ఎస్ ఐ జి హరీష్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం విజయ్ రోజుకు 20 గంటలు పనిచేస్తారు : ఆధవ్ అర్జున

**ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రతిరోజూ 20గంటలు పని చేస్తారని ఆ రాష్ట్రమంత్రి ఆధవ్ అర్జున వెల్లడించారు. రోజూ ఉదయం 4గంటలకే తన దినచర్యను ప్రారంభిస్తారని.. ఆ తర్వాత మంత్రులతో సంబంధిత శాఖల్లోని సమస్యలు, ఆరోజు చేపట్టాల్సిన పనుల గురించి చర్చిస్తారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం ఎటువంటి సంబరాలు చేసుకోకుండా రాష్ట్రం కోసం పని చేస్తున్నారని కొనియాడారు. చెన్నైలో జరిగిన 'ఇండియా టుడే తమిళనాడు కాంక్లేవ్'లో మాట్లాడుతూ విజయ్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'ఎన్నికల్లో గెలిచాను కదా అని మా సీఎం విశ్రాంతి తీసుకోవట్లేదు. ప్రభుత్వానికి ఉన్న సవాళ్లను గుర్తించడానికి అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ప్రజల ఇబ్బందులు, మంత్రిత్వ శాఖలలోని సమస్యల పరిష్కరించడంపైనే దృష్టి సారించారు. ప్రజల కోసం మాత్రమే పని చేయాలని మాకు సూచించారు. ఎప్పుడు చూసినా ఏం చేయాలి? ఎలా చేయాలి? దీని తర్వాత ఇంకేం చేయాలి? ఇంకా ఎంత మెరుగ్గా చేయగలం? అనే ఆలోచనల్లోనే ఉంటారు. ఆర్థిక వనరుల దుర్వినియోగాన్ని అరికట్టాలని, ప్రభుత్వ ప్రక్రియలన్నింటిలోనూ పారదర్శకత పాటించాలని విజయ్ మాకు తరచూ చెబుతుంటారు. రాష్ట్రంలోని అతిముఖ్యమైన సమస్య అవినీతి అని సీఎం బలంగా నమ్ముతారు. రాష్ట్రంలో ఆర్థిక వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, ప్రభుత్వ



పనితీరులో పారదర్శకతను పెంచడానికి అధికారంలోకి వచ్చిన తొలి 100 రోజుల్లోనే మా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కానీ, కింది స్థాయిలో ఇంకా అవినీతి ఉంది. దశాబ్దాలుగా అధికార యంత్రాంగంలో పాతుకుపోయిన ఈ సమస్యను కూడా త్వరలోనే పూర్తిగా నివారిస్తాం' అని ఆధవ్ అర్జున పేర్కొన్నారు.

# ప్రత్యక్ష పద్ధతిలో స్థానిక సంస్థల ఎన్నికలు

### క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన యనమల



**కోటనందూరు, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని మాజీ ఆర్థిక మంత్రి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్వాగతించారు.తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మీడియాతో ప్రత్యక్ష ఎన్నికల విధానమే తెలుగు దేశం పార్టీ పాలసీ అని,తాను మున్సిపల్ మంత్రిగా వ్యవహరించినప్పట్నుంచీ ఇదే విధానం కొనసాగించామని ఆయన స్పష్టం చేశారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యక్ష ఎన్నికలకు స్వస్తి పలికి పరోక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొచ్చిందని యనమల పేర్కొన్నారు. రాజకీయ అస్థిరతకు చోటివ్వకూడదన్నదే టీడీపీ లక్ష్యమని అందుకోసమే తిరిగి ప్రత్యక్ష ఎన్నికల విధానం తీసుకుని రావాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమన్నారు. పరోక్ష ఎన్నికల వల్ల అవిశ్వాసం బూచిని చూపి చైర్మెన్లను పదవీచ్యుతలను చేయడం వల్ల పరిపాలన స్వేచ్ఛ గా ముందుకు కొనసాగదు అన్నారు.

# జూలై నెలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

### 14 మందికి జరిమానా ఒకరికి జైలు శిక్ష – కోటనందూరు ఎస్సై టి.రామకృష్ణ




**కోటనందూరు, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** జులై నెలలో నమోదు చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 14 మందిలో ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు జరిమానా ఒక్కరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై టీ.రామకృష్ణ తెలియజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై నెలలో రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందన్నారు. 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా కోర్టు వారికి జరిమానా శిక్షలు విధించినట్లు తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దు మీ ప్రాణాన్ని మీ కుటుంబాన్ని ఇతర ప్రాణాలను ప్రమాదంలో పడవేయవద్దు అని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిత్యం కొనసాగుతుందని మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

### సింగంపల్లి స్వామికి జన్మదిన శుభాకాంక్షలు

# తెలియజేసిన కూటమి నాయకులు



**కరప, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామంలో సింగంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనసేన యువనేత స్వామికి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు పుట్టిన రోజుని పురస్కరించుకుని యువకులు అధిక సంఖ్యలో పాల్గొని స్నేహితునిపై ఉన్న అభిమానాన్ని ప్రేమను స్వతంత్ర దినోత్సవం రోజున రక్తదాన శిబిరం నిర్వహించి సుమారు 25 మంది యువత రక్తదానం చేసి అటు దేశభక్తిని మరియు స్నేహితులపై ఉన్న అభిమానాన్ని ఘనంగా చాటారు అదేవిధంగా సింగంపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట రామకృష్ణ మాట్లాడుతూ యువత పార్టీలు పబ్బులు కాకుండా ఇటువంటి మంచి కార్యక్రమాల్లో పాల్గొని ఆపదలో ఉన్నవారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి రక్తదానం చేయడం మంచి సందేశం అని అన్ని దానాల్లో కన్నా రక్తదానం మిన్న అనే ఉద్దేశంతో మంచి సందేశం ఇవ్వడం చాలా సంతోషమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభయ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు చీపురుపల్లి జయంద్రబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్, పెనుగుదురు పిఎసి డైరెక్టర్ సింగంపల్లి నాగేశ్వరావు, జనసేన పార్టీ ఎస్సీ సెల్ కరప మండల అధ్యక్షులు మెండు గోవిందు, వెలమ సంఘ నాయకులు ఎనిమిరెడ్డి వెంకటరమణ, మరియు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు

### 20న కాకినాడలో

# నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా

### 1100 ఉద్యోగాల భర్తీ

**కాకినాడ రూరల్, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంతో కాకినాడ రాజీవ్ గాంధీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 1100 ఉద్యోగాలకు భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 18 ప్రముఖ ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో ఉన్న దాదాపు 1100 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆగస్టు 20గురువారం ఉదయం 9:00 గంటలకు ఎస్సార్ఎంటీ మాల్ దగ్గరలోని రాజీవ్ గాంధీ డిగ్రీ కాలేజ్ వేదికగా ఈ ఇంటర్వ్యూలు నిర్వహించ బడతాయన్నారు.ఈ ఉద్యోగాలకు ఎస్.ఎస్.సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ బీటెక్, డిప్లొమా, ఐటీఐ డీబీఎం ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. పోస్టుల స్వభావాన్ని బట్టి పురుషులు, మహిళలు ఇద్దరూ ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చున్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు ఈ జాబ్ మేళా కు హాజరుకావాలని ఆయన కోరారు. ఎంపికైన అభ్యర్థులకు వారు దక్కించుకునే పోస్టు, అనుభవాన్ని బట్టి నెలకు రూ.15,000/- నుండి రూ.25,000/- వరకు వేతనం లభిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కావాల్సిన పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, సమగ్ర వివరాలతో కూడిన బయోడేటా (రెజ్యూమ్) మరియు వాటి జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తీసుకుని రావాలని ఆయన తెలిపారు.ఈ జాబ్ మేళాకు సంబంధించి మరిన్ని ఇతర వివరాలు లేదా సందేహాల కొరకు 8639846568 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# వైకాపా నేత జోగి రమేష్ ముందస్తు బెయిల్‌పై తీర్పు వాయిదా


**విజయవాడ, ఆగస్టు 18, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఈనెల 21కి వాయిదా పడింది. కోడలు మేఘన ఫిర్యాదుతో జోగి రమేష్, ఆయన సోదరుడు రాము, సోదరి రమా సహా 11 మందిపై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మేఘన ఫిర్యాదుతో నిందితులపై పోలీసులు హత్యాయత్నం, అదనపు వరకట్న వేధింపులు, గృహహింస చట్టం, మోసం కింద కేసులు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం జోగి రమేష్ పిటిషన్ దాఖలు చేయగా కోర్టులో వాదనలు జరిగాయి. జోగి రమేష్‌పై ఇప్పటికే 60కి పైగా క్రిమినల్ కేసులున్నాయని, బాధితురాలిపై హత్యాయత్నం చేయడమే కాకుండా బలవంతంగా మతమార్పిడికి యత్నించారని కోర్టుకు పీపీ తెలిపారు. రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు బనాయించారని, హత్యాయత్నం, వరకట్న వేధింపులకు ఎటువంటి ఆధారాలు లేవని జోగి రమేష్ తరఫు న్యాయవాదులు వాదించారు.

### డ్వాక్రా రుణాల బ్యాంకుల వడ్డీ దోపిడిపై

# అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే వేగుళ్ళ

**ఒక్కో గ్రూపుపై ఏటా రూ.30 వేలు నుండి రూ.60 వరకూ హిడెన్ ఛార్జీల బాదుడు**
**అన్ని బ్యాంకులకు ఒకే రకమైన ఏకరీతి వడ్డీ విధానం అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**మండపేట టౌన్, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గళమెత్తారు.డ్వాక్రా రుణాలపై బ్యాంకుల వడ్డీ వ్యత్యాసం పై ఆయన మాట్లాడారు. ఒక్కో గ్రూపుపై ఏటా రూ.30 వేలు నుండి రూ.60 వరకూ హిడెన్ ఛార్జీల బాదుడు పడుతుందన్నారు. అన్ని బ్యాంకులకు ఒకే రకమైన ఏకరీతి వడ్డీ విధానం అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళ వారం జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు డ్వాక్రా మహిళా సంఘాలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక సమస్యలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలు సొంత కాళ్లపై నిలబడాలనే ఉన్నతాశయంతో కోటి మందికి పైగా సభ్యులతో డ్వాక్రా వ్యవస్థను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం జాతీయ బ్యాంకులు వసూలు చేస్తున్న విపరీతమైన వడ్డీలు, అదనపు ఛార్జీల వల్ల మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారని సభ దృష్టికి



తీసుకెళ్లారు. జాతీయ బ్యాంకులన్నీ ఆర్‌బీఐ ఒకే నియమావళి కింద నడుస్తున్నప్పటికీ, ఒక్కో బ్యాంకు ఒక్కో రకమైన వడ్డీని గుంజుతోందని ఆయన విమర్శించారు. ఇండియన్ బ్యాంక్ 8.70% వడ్డీ వసూలు చేస్తుంటే, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏకంగా 13.75% వడ్డీ వసూలు చేస్తోందని తెలిపారు. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా 11.30%, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 10.05%, సెంట్రల్ బ్యాంక్ 12.30% చొప్పున వసూలు చేస్తూ మహిళలపై అదనపు భారం మోపుతున్నాయని సభకు వివరించారు. వడ్డీకి తోడుగా ప్రాసెసింగ్ ఛార్జీలు, ఇన్స్పెక్షన్ ఛార్జీలు, జి ఎస్ టి సిబిల్ స్కోర్ చెకింగ్, సి జి ఎఫ్ ఎం యూ ఛార్జీల పేరుతో ఒక్కో డ్వాక్రా గ్రూపు నుండి సంవత్సరానికి రూ.30,000 నుండి రూ, 60,000 వరకు అదనంగా గుంజుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 98%కి పైగా రీపేమెంట్ క్రమశిక్షణ కలిగిన మహిళా సంఘాలపై ఈ విధమైన రుసుములు వేయడం తీవ్ర అన్యాయమన్నారు. రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల్లో డ్వాక్రా రుణాలకు ఒకే రకమైన తక్కువ వడ్డీ రేటు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా రుణాలు చెల్లించే సంఘాలకు ఎప్పటి నుంచో బకాయి ఉన్న 'వడ్డీ రాయితీ సొమ్మును విడుదల చేసి మహిళలకు అందజేయాలన్నారు. కోటి మందికి పైగా ఉన్న డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ బ్యాంకింగ్ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల శాసనసభ ముఖంగా కోరారు.

## సమీకృత వ్యవసాయంపై రైతులకు అవగాహన : శాస్త్రవేత్త వాసుదేవ రెడ్డి






**కోరుకొండ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** సమీకృత వ్యవసాయం ద్వారా రైతులు చేపల పెంపకం తద్వారా నాటు కోళ్ల పెంపకం వంటి పద్ధతులు అవలంబించినట్లయితే అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ వాసుదేవ రెడ్డి అన్నారు. మంగళవారం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో గోకవరం,కోరుకొండ,సీతానగరం రైతులను వ్యవసాయ సంకేతిక యాజమాన్యాసంస్థ (ఆత్మ) తూర్పు గోదావరి జిల్లా ఆధ్వర్యములో రైతులను అంతర రాష్ట్రవ్యవసాయ విజ్ఞానయాత్రకు రీజినల్ వ్యవసాయ పరిశోధన సంస్థకు మార్టేరుకు తీసుకు వెళ్ళ సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త వాసుదేవరెడ్డి మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ విధానంలో వరి సాగులో చేపల పెంపకం ఉపరి తలములో నాటు కోళ్ల పెంపకం, పొలం గాట్లు పప్పుదినుసుల మొక్కలు పెంపకం వంటి అంశాలపై వివరించారు. అనంతరం దగ్గరులో పశువుల పెంపకం పై అవగాహన కల్పించారు.కోళ్ల నుంచి వచ్చే వ్యర్థలు,నీటిలో పడి చేపలకు చేపలకు హారంగా ఉపయోగపడడం పై అవగాహన కల్పించారు.చేపల సాగు వ్యర్థలు వరికి ఇరువుగా ఎంతగానో ఉపయోగపడు తుందని, రసాయనక ఎరువులు పెద్దగా అవసరం లేదన్నారు. పొలం గట్లపై మునగ, కంది, అరటి, ఆకుకూరలు, పశువులకు పచ్చగాడ్డి పెంచిటం, పశువుల వ్యర్థలు వెర్మీ కంపోస్ట్ తయారు చేసి వరికి, ఉద్యానవన పంట పొలానికి వాడటం వంటి అంశాలను తెలియజేశారు.నాటు కోళ్ల పెంపకం వలన గుడ్లు, కోళ్ల అమ్మకం ద్వారా ఆర్థిక లాభం పొందావచ్చఅన్నారు. మేకలు, గొర్రెలు పెంపకానికి ఎంతగానో అనువుగా ఉంటుందన్నారు. ప్రధాన శాస్త్రవేత కృష్ణాజి గారు నూతన వరి వంగ దాల సాగు ను రైతులకు రైతులకు చూపించి వివారాలు తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు ఎలుకుల యాజమాన్యం,కోతుల యాజమాన్యం గురించి వివరించారు. వ్యవసాయశాఖ ద్వారా అందుబాటులో యాత్ర పరికరాలు, PMDS kits, ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో సాగుచేయని పొలాలకు అపరాలు ఇస్తున్నామని వాటిని ఉపయోగించి భూమిని ఖాళీగా ఉంచుకుంటే సాగులోకి తీసుకురావాల న్నారు.ఈ కార్యక్రమంలో కోరుకొండ ఏడి ఏ శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారిగెడ్డం శాంసన్ డేవిడ్, మూడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గోకవరంలో వంటగ్యాస్‌పై అర్ధనగ్న ప్రదర్శన

**45 రోజుల తర్వాత సిలిండర్ అందించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్**



**గోకవరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** వంట గ్యాస్ సరఫరాలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రజా నాయకులు గోకవరంలో ఆందోళన చేపట్టారు. గోకవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్థ నగ్న ప్రదర్శన నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం 45 రోజుల తర్వాత గ్యాస్ సిలిండర్ అందించే విధానం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా వినియోగదారులకు సకాలంలో వంటగ్యాస్ అందించే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్ ప్రజల నిత్యావసర వస్తువని, సరఫరాలో జాప్యం కారణంగా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ప్రజలకు అనుకూలంగా గ్యాస్ సరఫరా విధానాన్ని రూపొందించి, సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 45 రోజుల సరఫరా విధానాన్ని రద్దు చేసి, సకాలంలో సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. ప్రజల సమస్యను ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ప్రజా నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరసాల ప్రసాద్, గాజింగం నాని, అంద్రు నాగేంద్రుడు, మహిపాల నాగులు, ఏనుగుల శ్రీను, మాగాపు కన్నా, తదితరులు పాల్గొన్నారు

## ఎయిడ్స్‌పై అవగాహన కల్పించిన వీధి నాటకం



**గోకవరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వీధి నాటకం ప్రదర్శించారు. జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు, వివక్ష చూపకుండా వారితో సమాజం కలిసి జీవించాలని సూచించారు. అదేవిధంగా ఎయిడ్స్ నివారణలో కండోమ్ ఉపయోగం, సురక్షిత జీవన విధానంపై అవగాహన కల్పించారు. వ్యాధి పట్ల అపోహలు, భయాలు వీడి సరైన అవగాహనతో ముందుకు సాగాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ప్రిన్సిపల్ సుధాకర్, లింక్ వర్కర్స్ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతానగరం ఎంపీపీ కార్యా లయంలో వికసిత్ భారత్‌పై అవగాహన

**సీతానగరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, నందు ఉదయం పది గంటలకు ' వికసిత్ భారత్ – రోజ్‌గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం, 2025' యొక్క నిబంధనలు మరియు అమలుపై అవగాహన కల్పించేందుకు ఎం.పీ.డీ.వో ఎమ్. భారతి అద్యక్షతన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి, ఎం.పి.పి, ఎం.పి. టీ.సి లు , పంచా యితీ స్పెషల్ ఆఫీసర్ ఎ పి ఓ బి.వి సత్యవతి పాల్గొ న్నారు.




## డ్రగ్స్‌పై పోలీసుల ఉక్కుపాదం..

**కేశవరెడ్డి స్కూల్‌లో 120 మంది విద్యార్థులకు అవగాహన!**




**రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవళేశ్వరం గ్రామంలో విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశవరెడ్డి స్కూల్‌లో సౌత్ జోన్ ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 120 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్‌కు సంబంధించిన నేరాలు, చట్టపరమైన పరిణామాలపై పోలీసులు వివరించారు.మత్తు పదార్థాలకు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలి, అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ ఈగల్ బృందానికి చెందిన ఎస్ఐ విజయ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు, పోలీస్ కానిస్టేబుళ్లు రామ్ కుమార్, చిన్న శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీతానగరం మండలంలోని పలు రోడ్లకు మహర్దశ



**సీతానగరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** 2027 గోదావరి పుష్కర పనులకు సంబంధించి మంజూరైన సీతానగరం మండలం లోని పలు రోడ్లకు శ్రీకారం చుట్టారు. వంగలపూడి లోని వినాయకుడి గుడి నుండి ఇసుక ర్యాంప్ వరకు సిసి రోడ్డు,మునికూడలి నుండి కాటవరం కూనవరం రోడ్డును కలిపే వరకు బిటి రోడ్డు,రామచంద్రపురం లో ఆంజనేయ స్వామి గుడి నుండి మెట్ల ఘాట్ వరకు సిసి రోడ్డు, ఇనుగంటివారి పేటలో చిక్కాల దేవానంద్ ఇంటి నుండి లంకాలమ్మ గుడి వరకు సిసి రోడ్డు, కాటవరం (3/5) కి.మీ నుండి కూనవరం (5/0) కి.మీ వరకు బిటి రోడ్డు, కాటవరం లో పిడబ్ల్యుడి ఘాట్ నుండి పుష్కర్ ఘాట్ వరకు సిసి రోడ్డు,పురుషోత్తపట్నంలో ఉన్న సిసి రోడ్డు నుండి శివుని విగ్రహం వరకు సిసి రోడ్డు,వంగలపూడి నుండి చిన కొండేపూడి పెదకొండేపూడి రోడ్డును కలిపేవరకు డబ్ల్యు బి ఎం రోడ్డు, బొబ్బిలంకలో పిత ముసలి ఇంటి నుండి ఎస్సీ స్మశాన వాటిక వరకు సిసి రోడ్డు,జాలిముడిలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి గట్టు ద్వారా వినాయకుడి గుడి వరకు సిసి రోడ్డు, రఘుదేవపురంలో ఎన్టీఆర్ విగ్రహం నుండి రఘుదేవపురం ఘాట్ వరకు డబ్ల్యు బి ఎం రోడ్డు పనులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ కు రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సీతానగరం మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## జెడ్ మేడపాడు సెంటర్‌లో ట్రాఫిక్ నివారణ చర్యలు

**రోడ్డు ఇరువైపులా దుకాణాదారులకు అవగాహన : రూరల్ సీఐ పి.దొరరాజు**

**మండపేట మండలం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం,జెడ్ మేడపాడు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యల నివారణకు దుకాణాల యజమానులకు రూరల్ సీఐ పీ.దొరరాజు అవగాహన కల్పించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం, దుకాణాల నేమ్‌బోర్డులను రోడ్డుపై ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. దుకాణాల ఎదుట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలు, నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకుండా యజమానులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ఆటోలు, బస్సులను టీ జంక్షన్ వద్ద నిలపకుండా కొంత దూరంలో నిలిపితే ట్రాఫిక్ సమస్యలను నివారించవచ్చన్నారు. ప్రయాణికులు కూడా సెంటర్‌లో కాకుండా కొంత దూరంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆటోలు, బస్సులు ఎక్కేలా సహకరించాలని కోరారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు.



### సీతానగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద

## ఈ-ఆటోలను ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నూతన "ఈ–ఆటో" ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ రిబ్బన్ కట్ చేసి, నూతన ఈ–ఆటోలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు ఈ–వాహనాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మండలంలో పారిశుధ్య నిర్వహణ సేవలను మరింత వేగవంతం చేసేందుకు ఈ ఉచిత/నూతన ఈ–ఆటో ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో), స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి కూటమి నాయకులు, మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# దూకుడుగా 'ఫౌజీ' షూటింగ్..

## కష్టపడుతున్న మూడు యూనిట్లు..!

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'ఫౌజీ' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించడమే కాకుండా, సెప్టెంబర్ నాటికి తన పోర్షన్ పూర్తి చేసి నెక్స్ట్ ప్రాజెక్ట్‌కి మారేలా ప్లాన్ చేశాడు. సమయాన్ని ఆదా చేసేందుకు ఏకంగా మూడు వేర్వేరు యూనిట్లు నిరంతరం శ్రమిస్తుండగా, ప్రభాస్ సన్నివేశాలను హను రాఘవపూడి స్వయంగా డైరెక్ట్ చేస్తున్నాడు. ఇమాన్వి ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్, డిసెంబర్ 3న సినిమాను విడుదల చేయాలని డెడ్‌లైన్ విధించింది. మేకర్స్ ఇప్పటికే ఈ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించడంతో, అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేసి పోస్ట్ ప్రొడక్షన్ పనులను ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ ఏమాత్రం విరామం లేకుండా డే అండ్ నైట్ పనిచేస్తోంది.

నా జీవితంలో సంతోషాన్నిచ్చే

# ఒకే ఒక పని అదే..

## బిగ్ బాస్ బ్యూటీ ఇనయ సుల్తానా



బిగ్ బాస్ షో ద్వారా చాలా మంది పాపులర్ అయ్యారు. అలాగే కొంతమంది బిగ్ బాస్ గేమ్ షో తర్వాత వరుసగా సినిమాలు, టీవీ షోలు చేస్తున్నారు కొందరు మాత్రం అసలు ఎక్కడ కనిపించడం లేదు. వారిలో ఇనయ సుల్తానా ఒకరు. ఈ బ్యూటీ యాంకర్ గా ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. బిగ్ బాస్ షో ద్వారా చాలా మంది పాపులర్ అయ్యారు. అలాగే కొంతమంది బిగ్ బాస్ గేమ్ షో తర్వాత వరుసగా సినిమాలు, టీవీ షోలు చేస్తున్నారు కొందరు మాత్రం అసలు ఎక్కడ కనిపించడం లేదు. వారిలో ఇనయ సుల్తానా ఒకరు. ఈ బ్యూటీ యాంకర్ గా ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో ఇంటర్వ్యూ ద్వారా ఇనయా పాపులర్ అయ్యింది. ఆతర్వాత ఆమె పేరు మారుమ్రోగింది. అలాగే ఆయనతో కలిసి ఓ పార్టీలో డాన్స్ చేయడం కూడా అప్పుడు సెన్సేషన్ అయ్యింది. ఇక ఈ ముద్దుగుమ్మ బిగ్ బాస్ గేమ్ షోలోకి అడుగుపెట్టింది. బిగ్?బాస్ సీజన్ 6లో కంటెస్టెంట్ గా అడుగుపెట్టి ఈ బ్యూటీ తన ఆట తీరుతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఇక ఈ షో నుంచి బయటకు వచ్చిన తర్వాత నెట్టింట ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత వరుసగా టీవీ షోలు, సినిమాలతో బిజీగా గడిపింది. అయితే సోషల్ మీడియా వేదికగానే ఈ అమ్మడు తన బాయ్ ఫ్రెండ్ ను కూడా పరిచయం చేసింది. ఆతర్వాత ఈ ఇద్దరూ విడిపోయారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో తన బ్రేకప్ స్టోరీ చెప్పి ఎమోషనల్ కూడా అయ్యింది ఇనయ సుల్తాన. అలాగే తన కెరీర్, వ్యక్తిగత జీవితం, సోషల్ మీడియాపై తన అభిప్రాయాలను పంచుకుంది. ఇనయ సుల్తానా మాట్లాడుతూ.. సాధారణ వ్యక్తులు చేసిన పని లేదా మాట్లాడిన మాట అంతగా వైరల్ అవ్వదు.., కానీ సెలబ్రిటీలు మాట్లాడితే మాత్రం మీడియా దాన్ని పెద్దది చేస్తుందని చెప్పుకొచ్చింది ఇనయ. ఇది పీఆర్ గేమ్స్‌లో భాగం కావచ్చని, సినిమా ప్రమోషన్ల కోసం కూడా ఇలా జరుగుతుందని ఆమె అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసే ఫోటోల గురించి మాట్లాడుతూ తన జిమ్ ఫోటోలు ఎక్కువగా షేర్ చేస్తూ ఉంటాను. తాను ఎక్కువగా డిప్రెషన్‌లో ఉన్నానని, దాన్ని అధిగమించడానికి కొత్త విషయాలను అన్వేషించాలని అనుకుంటున్నానని, జిమ్ తన జీవితంలో ఒకే ఒక సంతోషాన్నిచ్చే పని అని ఆమె చెప్పారు. డబ్బుతో ప్రపంచంలో ఏదైనా కొనవచ్చని, కానీ శరీరాన్ని కొనలేమని, మార్చలేమని ఆమె అన్నారు. జిమ్‌లో కష్టపడి శరీరాన్ని మార్చుకోవడం వల్ల లభించే సంతృప్తి చాలా గొప్పదని, అందుకే తాను కేవలం జిమ్ ఫోటోలు మాత్రమే ఇన్ స్టాలో పెడతానని స్పష్టం చేశారు.




# తండ్రికి తగ్గ తనయ..

## రాకెట్‌లా దూసుకుపోతున్న పుల్లెల గాయత్రి



భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్‌లో రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది పుల్లెల గాయత్రి. ట్రీసా జాలీ జంటగా అంతర్జాతీయ స్థాయిలో స్థిరంగా రాణిస్తోంది. గాయత్రి నిలకడగా మంచి ప్రదర్శనలు చేస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం ఆమెను తాజాగా అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గాయత్రి కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను ఓసారి పరిశీలిస్తే.. గాయత్రి బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ కుమార్తె అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆమె తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ బ్యాడ్మింటన్‌లో దూసుకుపోతోంది. ట్రీసా జాలీతో కలిసి ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ 2022లో మహిళల డబుల్స్ సెమీ ఫైనల్‌కు చేరడంతో గాయత్రి బ్యాడ్మింటన్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అప్పట్నుంచి వరుస విజయాలతో అంచెలంచెలుగా ఎదుగుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటోంది. తండ్రి బ్యాడ్మింటన్ ప్లేయర్ కావడంతో చిన్నప్పటి నుంచే ఆటపై ఆసక్తిని పెంచుకుంది. గోపీచంద్ అకాడమీలో స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పి.వి.సింధులను గమనించి వారితో కలిసి శిక్షణ పొంది తన నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకుంది. గాయత్రి వివిధ జూనియర్ అంతర్జాతీయ టోర్నమెంట్లలో రాణించి 15 ఏళ్ల వయసులోనే అండర్-17 విభాగంలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. దేశవాళీ ర్యాంకింగ్ టోర్నమెంట్లలో అద్భుత విజయాలు సాధిస్తూ 15 ఏళ్లకే జకార్తా 2018 ఆసియా క్రీడల ఆసియా క్రీడలలోని అనుభవంతో గాయత్రి 2019లో సీనియర్ స్థాయి పోటీల్లో అడుగుపెట్టి నేపాల్‌లో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో రజత పతకం సాధించింది. కొవిడ్ మహమ్మారితో 2020 ఏడాది వృథా కాగా.. 2021 సంవత్సరం గాయత్రి కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. అప్పటివరకు ప్రధానంగా సింగిల్స్ క్రీడాకారిణిగా ఉన్న గాయత్రి.. తండ్రి గోపీచంద్, కోచ్ అరుణ్ విష్ణు ప్రోత్సాహంతో డబుల్స్ విభాగంలోనూ ప్రయత్నించాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో గోపీచంద్ అకాడమీలో ట్రీసా జాలీ రూపంలో గాయత్రికి సరైన జోడీ దొరికింది. ఈ జంట 2021లో 'ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్'లో స్వర్ణ పతకాన్ని సాధించగా.. ఆ తర్వాత వెల్ష్ ఇంటర్నేషనల్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. 2022లో గాయత్రి, ట్రీసా జాలీ సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ ఫైనల్‌కు చేరడంతో పాటు ఒడిశా ఓపెన్‌లో తమ తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ సొంతం చేసుకున్నారు. ఈ జోడీ వరుసగా రెండుసార్లు (2024, 2025) సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్‌ను సాధించింది. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఎన్నో అద్భుత విజయాలు సాధించి దిగ్గజ ఆటగాడిగా గుర్తింపు పొందారు. ఆయనను అర్జున అవార్డు (1999), ఖేల్ రత్న అవార్డు (2001), పద్మ శ్రీ (2005), పద్మభూషణ్ (2014) పురస్కారాలు వరించిన విషయం తెలిసిందే. గోపీచంద్ తన కుమార్తె ఏ రంగం వైపు వెళ్లాలనే విషయంలో పూర్తిస్వేచ్ఛను ఇచ్చానని ఓ సందర్భంలో అన్నారు. 'బ్యాడ్మింటన్ ఆడాలనేది ఆమె నిర్ణయమే. ఒకవేళ ఆడటం ఇష్టం లేకపోతే ఫర్వాలేదని నేను ఎప్పుడూ చెబుతూనే వచ్చాను. కానీ నాకంటే ఆమెకే దీనిపై ఎక్కువ ఆసక్తి ఉంది. దీనికి నేను చాలా సంతోషిస్తున్నాను" అని గోపీచంద్ తెలిపారు.

# హాకీ ప్రపంచ కప్..

## భారీ విజయంతో బోణీ కొట్టిన భారత్



మహిళల హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు తొలి విజయం నమోదు చేసింది. ఒలింపిక్ రజత పతక విజేత చైనాతో తొలి మ్యాచ్‌ను 2-2 డ్రా చేసుకున్న భారత్.. మంగళవారం పూల్-డి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 6-1 తేడాతో చిత్తుగా ఓడించింది. ప్రపంచ కప్‌లో భారత జట్టుకు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. తొలి క్వార్టర్‌లో సునేలిత (11వ నిమిషం) గోల్ చేయడంతో సలీమా టెటే సారథ్యంలోని భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్‌లో నవ్‌నీత్ కౌర్ (17వ నిమిషం), సుశీలా చాను (25వ) చెరో గోల్ చేశారు. ఇక మూడో క్వార్టర్‌లో భారత్ ఏకంగా మూడు గోల్స్ చేసి తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దీపిక (38వ), లాల్‌రెమ్సియామి (44వ), రాణా సాక్షి (45వ) తలో గోల్ కొట్టడంతో భారత్ ఘన విజయం సాధించింది. కైలా డి వాల్ (55వ) గోల్ చేయడంతో దక్షిణాఫ్రికా ఆ ఒక్క పాయింట్ దక్కింది.

# తొలి రౌండ్‌లో లక్ష్యసేన్ విజయం..

## ప్రిక్వార్టర్స్‌కు గాయత్రి-ట్రీసా జాలీ జోడీ



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో రెండో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 64 మ్యాచ్‌లో లక్ష్యసేన్ 16-21, 21-8, 21-4 తేడాతో కొల్లిన్స్ ఫిలిమోన్ (ఆస్ట్రియా)పై విజయం సాధించాడు. తొలి గేమ్‌లో పోరాడి ఓడిన లక్ష్యసేన్.. తర్వాత రెండు గేమ్‌ల్లో అద్భుతంగా ఆడి ప్రత్యర్థిని చిత్తుగా ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా రౌండ్ ఆఫ్ 32కు దూసుకెళ్లింది. థెట్ తుజార్‌తో జరిగిన హోరాహోరీగా సాగిన పోరులో ఉన్నతి 22-20, 21-16 తేడాతో గెలుపొందింది. మహిళల డబుల్స్ విభాగంలో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ ప్రిక్వార్టర్స్‌కు చేరుకుంది. 16వ సీడ్ లారెన్ లామ్, ఆలిసన్ లీ (అమెరికా)ను గాయత్రి ద్వయం వరుస గేమ్‌ల్లో 21-15, 21-12 తేడాతో ఓడించింది. మహిళల డబుల్స్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో సెల్వం-సిమ్రాన్ సింఘి జోడీ 7-21, 14-21 తేడాతో గాబ్రియేలా స్టోవాస్టెఫానీ స్టోవా (బల్గేరియా) చేతిలో పరాజయం చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో అసిత్ సూర్య-అమృత ప్రముత్తేష్ జోడీ పోరాడి ఓడింది. 71 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పోరులో సోన్మెజ్-యాసెమెన్ బెక్తాస్ (తుర్కియే) చేతిలో భారత ద్వయం 21-16, 29-30, 22-24 తేడాతో ఓటమి పాలైంది. ఇదే విభాగంలో తొలి రౌండ్‌లో రోహన్ కపూర్-రుతివ గద్దె ద్వయం 22-20, 19-21, 17-21 తేడాతో జోనాథన్ లై-క్రిస్టల్ లై (కెనడా) చేతిలో పోరాడి ఓడింది.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...





VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com